సహకార సంఘాల అభివృద్ధిపై కలెక్టర్ సమావేశం

ఆదిలాబాద్‌అర్బన్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశంను శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజార్షిషా తన చాంబర్‌లో నిర్వహించారు. సమావేశంలో సహకార సంస్థల అభివృద్ధిపై చర్చించారు. సహకార సంఘముల అభివృద్ధిపై జిల్లా కలెక్టర్ సూచనలు, మార్గదర్శకాలు జారీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, జడ్పీ సీఈఓ జితేందర్‌రెడ్డి, డీసీఓ మోహన్, పశు సంవర్ధక శాఖ ఏడీ, మత్స్య శాఖ ఏడీ, డీసీసీబీ సీఈఓ, డీఓఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిరుత దాడిలో గొర్రెల మృతి

బోథ్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బోథ్ మండలంలోని బాబేరతండాలో శుక్రవారం రాత్రిపూట చిరుత మేకల మందపై దాడిచేసి నాలుగు గొర్రెలు, మేకలను చంపింది. విష యం తెలుసుకున్న అటవీ శాఖ అధికారి ప్రణయ్ బాబేర తండా గ్రామాన్ని సందర్శించి మృతిచెందిన మేకలను పరిశీలించారు. ఈ సందర్భంగా మేకల యజమాని అవునూరి రమేష్‌కు రూ.4,500 నష్ట పరిహారం అం దించారు. అయితే జరిగిన నష్టం అంచనా వేసి మిగతా నష్ట పరిహారాన్ని ఇప్పించడం జరు గుతుందన్నారు. చిరుతపులి గ్రామంలోకి ప్రవే శించి మేకలను చంపడంతో గ్రామస్తులు ఆం దోళనకు గురవుతున్నారు. అయితే ఈ సంద ర్భంగా అటవీ శాఖ అధికారి మాట్లాడుతూ భయపడవద్దని చిరుత చిన్నపిల్లలు, వృద్ధులపై దాడి చేస్తుందని అయితే ఒంటరిగా చేనులకు వెళ్లవద్దని అప్రమత్తంగా ఉండా లన్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు ఒంటరిగా ప్రయాణించవద్దని సూచించారు. బయటకు చేలకు వెళ్లినప్పుడు ముగ్గురు నలుగురు కలిసి వెళ్లాలని సూచించారు.

కుష్టువ్యాధిపై అవగాహన అవసరం

జైనథ్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జైనథ్ మండలంలోని ఆయా గ్రామాల ప్రజలకు కుష్టు వ్యాధిపై ఆరోగ్య వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని గిమ్మా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సూచల అన్నారు. శుక్రవారం జైనథ్ మండలంలోని గిమ్మా పీహెచ్‌సీ కార్యాలయంలో ఆయా గ్రామాల ఏఎన్‌ఎంలు ఆశావర్కర్లు, వైద్య సిబ్బందికి కుష్టువ్యాధి పై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వచ్చేనెల డిసెంబర్ 2 నుంచి 15వ తేదీ వరకు కుష్టు వ్యాధిపై సర్వే నిర్వహించి లక్షణాలున్న వారికి చికిత్స నిర్వహించి మందులు మాత్రలు అందించాలని గిమ్మా డాక్టర్ సూచల సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ రాంరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ అనిత చంద్రశేఖర్‌లతో పాటు ఆయా గ్రామాల ఏఎన్‌ఎంలు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి

బోథ్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : డిసెంబర్ 14న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి మౌనిక పేర్కొన్నారు. శుక్రవారం కోర్టు ఆవరణలో బ్యాంకు అధికారులతో పాటు పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. రాజీకియ అవకాశం ఉన్న క్రిమినల్, సివిల్, బ్యాంకు కేసులను ఎక్కువ మొత్తంలో పరిష్కారం అయ్యే విధంగా చూడాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీధర్, ఏజీపీ వంద్రం శంకర్, న్యాయవాదులు సుభాష్, రూపేందర్‌సింగ్, హరీష్, దమ్మ పాల్, విజయ్‌కుమార్, జమీర్, పోలీసులు కోర్టు కానిస్టేబుళ్లు ఉన్నారు.

కారుకు కలిసివచ్చేనా?

- జిల్లాలో అధికార పార్టీకి దీటుగా కార్యక్రమాలు
- ఉద్యమకాలపు జ్ఞాపకాలతో పెద్ద ఎత్తున దీక్షా దివస్
- స్థానిక ఎన్నికలపై బీఆర్‌ఎస్ ముందు చూపు
- పార్టీ శ్రేణుల్లో మరింత జోష్ నింపే ప్రయత్నం



దీక్షా దివస్‌లో పాల్గొన్న బీఆర్‌ఎస్ శ్రేణులు

ఆదిలాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల తర్వాత అధికారానికి దూరమైన కారు పార్టీ నిత్యం ప్రజల్లో ఉండేందుకు పక్కా ప్లాన్‌తో ముందుకెళుతోంది. ఏ చిన్న అవకాశం వచ్చినా వదిలిపెట్టకుండా ప్రభుత్వంపై ఎదురుదాడికి సిద్ధమవుతోంది. గత కొన్ని రోజుల క్రితమే రైతుభరోసా పేరిట జిల్లా కేంద్రంలో భారీ బహిరంగ సభను నిర్వహించి సక్సెస్ చేసిన బీఆర్‌ఎస్ నేతలు తాజాగా దీక్షాదివస్ పేరిటా ప్రజల్లో సెంటిమెంట్‌ను రగిలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఓటమి పాలైనా తగ్గేదే లేదంటూ అధికార పార్టీకి దీటుగా జిల్లాలో కార్యక్రమాలను చేపడుతూ హడావిడి చేస్తున్నారు. గడిచిన ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ హవా కనిపించినా జిల్లాలో మాత్రం గులాబి జెండాను ఎగుర వేశారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో స్వల్ప మెజార్టీతో ఓటమి పాలైన బోథ్‌లో భారీ మెజార్టీతో బీఆర్‌ఎస్ విజయం సాధించింది. ఇలా ఉద్యమకాలం నుంచి బీఆర్‌ఎస్‌కు జిల్లా ప్రజలు అండగా నిలుస్తూ వస్తున్నారు. పార్టీ క్యాడర్ చేజారీ పోకుండా ఎప్పటికప్పుడు శ్రేణుల్లో జోష్ నింపేందుకు వివిధ రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు.

రాజకీయ ఎత్తుగడ

జిల్లాలో దీక్షా దివస్‌ను పెద్ద ఎత్తున నిర్వహించడం రాజకీయ ఎత్తుగడలో భాగమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారంలో ఉండగా అంతగా పట్టించుకొని బీఆర్‌ఎస్ అధికారానికి దూరమైన తర్వాత తొలిసారిగా పెద్ద మొత్తంలో దీక్షా దివస్‌ను నిర్వహించడంపై రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మళ్లీ ఉద్యమకాలం నాటి జ్ఞాపకాలను గుర్తుచేస్తూ ప్రజలు పార్టీ శ్రేణులకు దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తోంది. ముఖ్యంగా ఉద్యమకాలం నాటి సంఘటనతో కూడిన ఫొటో ఎగ్జిబీషన్, ప్రసంగాలు, ఆనాటి ఘటనలను గుర్తు చేసుకుంటూ ప్రత్యేక రాష్ట్రం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమైందంటూ చెప్పే ప్రయత్నం చేస్తోంది. ఉద్యమ సమయంలో జిల్లాలో జరిగిన ముఖ్య ఘటనలను గుర్తు చేసుకుంటూ పార్టీ బలోపేతం వైపు అడుగులు వేస్తోంది. ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితులను తమకు అనుకూలంగా మల్చుకునేందుకు బీఆర్‌ఎస్ నేతలు రాజకీయ ఎత్తుగడలను వేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

పట్టు నిలుపుకునే ప్రయత్నం

పదేళ్ల తర్వాత అధికారానికి దూరమైన బీఆర్‌ఎస్ ప్రజల్లో మళ్లీ పట్టు నిలుపుకునే ప్రయత్నం చేస్తోంది. స్థానిక సమస్యల పట్ల స్పందిస్తూ అధికార పార్టీపై ఎదురుదాడికి దిగుతోంది. బోథ్‌లో పార్టీ ఎమ్మెల్యే గెలవడం ఆదిలాబాద్‌లో సీనియర్ నేత మాజీ మంత్రి జోగు రామన్న తన రాజకీయ అనుభవంతో దూకుడు పెంచుతున్నారు. అధికారంలో ఉండగా నేతల మధ్య పెద్దగా సఖ్యత కనిపించక పోయినా ఓటమి తర్వాత నేతలంతా ఒక్కటవుతూ కలిసి కట్టుగా ముందుకెళ్తున్నారు. కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరలేపిన జిల్లాలో పెద్దగా వలసలు కనిపించడం లేదు. ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు, ఓ మాజీ ఎంపీ, డీసీసీబీ చైర్మన్ తప్ప చెప్పుకోదగిన నేతలెవరు కాంగ్రెస్‌లో చేరలేదు. బీఆర్‌ఎస్‌పై ప్రజల్లో ఉన్న విశ్వాసంతోనే నేతలు పార్టీలో కొనసాగుతున్నారన్న టాక్ వినిపిస్తోంది. ఆదిలాబాద్‌లో కొంత మంది ముఖ్యనేతలు పార్టీ మారినా బోథ్ నియోజకవర్గంలో మాత్రం పార్టీ శ్రేణులు బీఆర్‌ఎస్ వైపే ఉన్నట్లు కనిపిస్తోంది. అయితే మరో నాలుగేళ్ల పాటు పార్టీలో ఎవరు ఉంటారో ఎవరు వెళ్లి పోతారో చెప్పలేని పరిస్థితి మాత్రం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

దూకుడు పెంచిన నేతలు

త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్న వార్తలు రావడంతో బీఆర్‌ఎస్ నేతలు మరింతగా దూకుడు పెంచుతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ వ్యతిరేక విధానాలే ప్రధాన ఎజెండాగా ముందుకెళ్తున్నారు. రైతు సమస్యలపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు. సాధ్యం కాదని తెలిసినా ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయాలని ఒత్తిడి చేయడం చర్చనీయాంశంగా మారింది. త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేందుకు బీఆర్‌ఎస్ పక్కా ప్లాన్‌తో ముందుకెళ్తుంది. ఇప్పటికే కొందరు నేతలను జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల బరిలోకి దింపేందుకు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. బోథ్ నియోజకవర్గంలో మాత్రం బీఆర్‌ఎస్ నేతల మధ్య పోటాపోటీ అన్నట్లుగా కనిపిస్తోంది. స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీఆర్‌ఎస్ పార్టీ ముందు చూపుతో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, గతంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుపై ప్రజల్లోకి బీఆర్‌ఎస్ వెళుతోంది. అయితే అధికార పార్టీని తట్టుకుని ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఏ మేరకు విజయ అవకాశాలను దక్కించుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.

లక్సెట్టిపేటలో తుకారం మ్యూజియం

- ఎమ్మెల్యే బొజ్జుపటేల్
- ఘనంగా వర్ధంతి



స్టోర్‌రూమ్‌లో బియ్యాన్ని పరిశీలిస్తున్న బొజ్జుపటేల్

ఉట్నూర్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి) ప్రియేటా తుకారం గృహాన్ని మ్యూజియంగా తీర్చిదిద్దడంతో పాటు గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండలంలోని తుకారం ఎక్స్‌రోడ్డు వద్ద దివంగత ఆదివాసీ ఐఏఎస్ అధికారి మడావి తుకారం 26వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ఆదివాసి గిరిజనులు ఆదివాసి సాంప్రదాయ వాయిద్యాలతో తుకారం ఎక్స్‌రోడ్డుకు చేరుకున్నారు. ఆదివాసి సాంప్రదాయాలతో తుకారం విగ్రహం వద్ద తెల్ల జెండా ఎగురవేసి పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే బొజ్జుపటేల్, జీసీసీ చైర్మన్ తిరుపతి, కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రంసుగుణ, ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారులు జాదవ్‌వసంత్‌రావు, మేస్రం మనోహర్, డీఏస్పీ నాగేందర్, మేస్రం దుర్గుపటేల్, ఆత్రం రాహుల్, పురకబాపురావ్, పెందూర్ ప్రభాకర్ తదితరులు పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం లక్సెట్టిపేట గ్రామంలో నిర్వహించిన వర్ధంతి సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ పిల్లలను విద్యావంతులను చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో సెడ్మకి రామారావు, కోట్నాక్ ఓమేష్, సట్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ

ఆశ్రమ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలు, వసతి గృహాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యమైన భోజనం అందించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని లక్షేటిపేట్ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ప్రతిరోజు రాష్ట్రంలో ఏదో ఒక చోట ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మెనుప్రకారం భోజనం అందక ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థుల్లో ఆత్మస్థయిర్యం పెంచడానికి పాఠశాలలు సందర్శిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. తమ బెడ్స్ నీట్‌గా ఉంచుకునే బాధ్యత విద్యార్థులదే అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్, భుజంగ్‌రావ్, మధుసూదన్‌లు పాల్గొన్నారు.

పాఠాలు బోధించిన కలెక్టర్

తలమడుగు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం బరంపురంలో పాలనాధికారి రాజర్షిషా బరంపూర్ జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాల పదోతరగతి విద్యార్థులకు మ్యాథ్స్ చెబుతూ విద్యార్థులతో మ్యాథ్స్ చేయించి, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. జిల్లా పాలనాధికారి స్వయంగా శ్రీకారం చుట్టిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కాలనుగత వ్యాధులకు సంబంధించిన కార్యక్రమంలో పాల్గొని అనంతరం పదోతరగతి చదువుతున్న విద్యార్థుల తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి తానే ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు లెక్కలు బోధించారు. జిల్లా కలెక్టర్ ఉపాధ్యాయుడిగా మారి తమకు పాఠాలు బోధించడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకుని ఉన్నత స్థానానికి చేరుకోవాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. తాము నిర్దేశించుకున్న లక్ష్యసాధన కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. పదిలో వందకు వందశాతం ఫలితాలు సాధించాలని, అందుకు విద్యార్థులు బాగా చదుకోవాలని, ఏదైనా సబ్జెక్టుల్లో వెనుకబడితే ప్రత్యేక తరగతులు నిర్వ హించడం జరుగుతుందని అన్నారు. రేపటి భావి భారత పౌరులు మీరే గనుక మంచి మార్గంలో నడిచి ఆదర్శ ప్రాయంగా నిలవాలని తెలిపారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న బడి తోటను పరిశీలించి విద్యార్థులకు ఆర్గానిక్ కూరగాయలను అందించడం అభినందనీయమన్నారు. బడితోటకు సరిపడా నీరు లేక కొన్ని మొక్కలు ఎండిపోవడంతో వాటికి డ్రిప్పు ద్వారా నీరు అందించాలని సూచించారు. అదే విధంగా పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ ఉండటంతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రత్యూషను ఉపాధ్యాయులను అభినందించారు.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న జిల్లా కలెక్టర్

- భవిష్యత్తు కోసమే ఆరోగ్య పాఠశాల

విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసమే ఆరోగ్య పాఠశాలను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండలం బరంపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను సందర్శించారు. వ్యాధుల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వేసవి కాలం, వర్షాకాలం, శీతాకాలం వంటి మూడు సీజన్లలో వచ్చే వ్యాధుల గురించి డాక్టర్ శ్రీధర్ వివరించడం జరిగిందని, వ్యాధుల బారిన పడకుండా జాగ్ర త్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం నిరంతరంగా కొనసాగేలా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలని తెలియజేశారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే విద్య నైపుణ్యాలను సాధించ గలుగుతారని అన్నారు. సమగ్ర సర్వే ఆన్‌లైన్ డేటా ఎంట్రీని ఎలాంటి తప్పులకు తావు లేకుండా ప్రతి కుటుంబం వివరాలను నమోదు చేయాలని జిల్లా పాలనాధికారి రాజర్షిషా అన్నారు. శుక్రవారం తలమడుగు మండలంలోని ఎంపీడీవో కార్యాలయం, బరంపూర్ పాఠశాలలో కొనసాగుతున్న సర్వే డేటా ఎంట్రీ చేసేటప్పుడు ఎన్యూమరేటర్ తప్పనిసరిగా దగ్గర ఉండి నమోదు చేయించాలని పలు సూచనలు, సలహాలు చేశారు. ప్రతిరోజు ప్రతి ఒక్కరు 40 మంది డాటాను నమోదు చేయాలన్నారు. సెలవు దినాల్లో కూడా పని చేయాలని సూచించారు. మండలంలోని బరంపూర్ కొండపై స్వయంభూగా వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆల యంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా ప్రత్యేక పూజలు నిర్వహించి, తెలంగాణ తిరుపతిగా అభివృద్ధి చెందుతున్న ఆలయాన్ని మరింత అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తానన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

- జిల్లా కలెక్టర్ రాజార్షిషా

ఆదిలాబాద్‌అర్బన్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి):పత్తి రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సీసీఐ కొనుగోలు కేంద్రాలలోనే అమ్మాలని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. పత్తి కొనుగోలుపై జిల్లా కలెక్టర్ రాజార్షిషా తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సీసీఐ కేంద్రాలలో అమ్మితేనే మద్దతు ధర దక్కుతుందన్నారు. జిల్లాలో 2 నెల 26 వరకు సీసీఐ ద్వారా 599588.87 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయడం జరిగిందని, ఇప్పటి వరకు 28967 మంది రైతుల ఖాతాల్లో 388.58 కోట్లు జమ చేయడం జరిగిందని తెలిపారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



ఇచ్చోడ ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఇచ్చోడ, నవంబరు 29,(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడలో కొనసాగుతున్న ప్రధాన రహదారి విస్తరణ పనులకు వాహనదారులు, పాదచారులు పనులు పూర్తయ్యే వరకు సహకరించాలని పోలీసులు సూచిస్తున్న ట్రాఫిక్ అంక్షాలను పాటించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కొమురం భీం, అంబేద్కర్ కూడలి వద్ద ఏర్పడ్డ ట్రాఫిక్‌ను తొలగిస్తూ వాహనదారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించి తగు సలహాలు, సూచన లు తెలియజేశారు. త్వరలోనే ఇచ్చో డ మండల ప్రజల చిరకాల కోరిక నేరవెర బోతుందని ప్రజలు సహకరించి రహదారి అభివృద్ధి పనులు ముందుకు సాగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారి

ఉట్నూర్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉట్నూర్ మండల ప్రత్యేక అధికారి సుధాకర్ శుక్రవారం ఉట్నూర్‌లోని ఉర్దూ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. రాష్ట్రంలో మధ్యాహ్న భోజనం పలు చోట్ల వికటించి విద్యార్థులు కలుషిత ఆహారం బారీన పడడంతో సీఎం పరిశీలించాలని కలెక్టర్‌లు, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్పెషల్ ఆఫీసర్ సుధాకర్ ఎండీఎం పరిశీలించి బాలికలతో కలిసి భోజనం చేశారు. ప్రతి రోజు మంచి ఆహారం పెట్టాలన్నారు.

కారు బోల్తా.. ఒకరి పరిస్థితి విషమం



బోల్తా పడ్డ కారు

ఉట్నూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఉట్నూర్ మండలంలోని నాగపూర్ వాగు సమీపంలో అదుపు తప్పి కారు చెట్టును ఢీకొట్టి బోల్తా పడడంతో డ్రైవింగ్ చేస్తున్న ఉద్యోగి పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. తెలంగాణ ట్రైబల్ టీచర్స్ సంఘం రాష్ట్ర నాయకులు ఆడే దినేష్ అయ్యప్ప మాల ధరించి ఉట్నూర్ నుంచి నివాసం అయిన పులిమడుగుకు వెళ్తుండగా గురువారం రాత్రి అడవి పంది అడ్డం రావడంతో తప్పించపోగా కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టి బోల్తా కొట్టింది. దినేష్ తలకు తీవ్రగాయం కాగా కుడిచేతు విరిగింది. దినేష్ ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో వైద్యం అందుకుంటున్నాడని బంధువులు తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

● యువకుడికి తీవ్ర గాయాలు

బోథ్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బోథ్ ఎక్స్ రోడ్డు నుంచి కుస్లాపూర్ గ్రామానికి వెళుతున్న అడెల్లును వెనుక నుంచి వచ్చిన లారీ బలంగా ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలపాలైన ఆయనను బోథ్ ఆసుపత్రికి తరలించారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల ధర్నా

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు శుక్రవారం ఆదిలాబాద్ పట్టణ, రూరల్, మావల మండల సమగ్ర శిక్షా ఉద్యోగులు మండలస్థాయి ధర్నా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సీఆర్‌పీల సంఘం జిల్లా అధ్యక్షులు దేవదర్శన్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతేడాది ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి హోదాలో వరంగల్ ధర్నా కార్యక్రమంలో పాల్గొని తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగులందరిని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో ఛాయ తాగెంత సమయంలో జీఓ ఇచ్చి రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇంత వరకు రెగ్యులర్ చేయలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్షా ఉద్యోగులు చాలిచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ మండలస్థాయిలో మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో మిస్ కో మంజుల, ప్రియాంక, సీసీఓ అఫ్రిన్, కాశి, ఐఈఆర్‌పీ రాజన్న, నరేష్, సీఆర్‌పీ విజయ్, అశ్వక్, శంకర్, రాజేశ్వర్, జావేద్, తేజస్వి పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లా కలెక్టర్‌ను కలిసిన

గెజిటెడ్ అధికారుల సంఘం నేతలు



జిల్లా కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న దృశ్యం

నిర్మల్ అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గాన్ని జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా ప్రగతికి గజిటెడ్ అధికారులు అందరూ తోడ్పాటునందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ కోరారు. నూతనంగా ఎన్నికైన తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నేతలు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ పీజీ రెడ్డి, డి. రమేష్ నేతృత్వంలో కలెక్టర్‌ను ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా అభివృద్ధికి గెజిటెడ్ అధికారుల సహకారం ఎంతో అవసరమని, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు, రాష్ట్రంలోనే జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని కోరారు. టీజీవోల భవనానికి స్థలం కేటాయించాలని టీజీవో నాయకులు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. గెజిటెడ్ అధికారుల సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లవేళలా కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం సంఘ సభ్యులను అధ్యక్షులు డాక్టర్ పీజీ రెడ్డి కలెక్టర్‌కు పరిచయం చేశారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్‌లను సైతం టీజీవో నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో టీజీవో అధ్యక్షులు డాక్టర్ పీజీ రెడ్డి, జిల్లా కార్యదర్శి డి. రమేష్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం. ప్రవీణ్ కుమార్, కే. శంకర్, యూ. రవి కుమార్, కే. గోదావరి, శ్రీనివాస్ గౌడ్, కే. రాజమల్లు, డాక్టర్ రాణి, వినోద్ కుమార్, కరుణశ్రీ పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం నిరసన దీక్షలు

భైంసా, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధన కోసం గాను తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం శుక్రవారం రెండు రోజుల నిరసన దీక్షలకు పూనుకుంది. ఇందులో భాగంగానే భైంసాలోని మండల విద్యావనరుల కేంద్రం ఎదుట దీక్ష చేపట్టింది. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేసి తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఇదే క్రమంలో రీ ఎంగేజ్ విధానం తొలగించాలన్నారు. ప్రభుత్వ నియమాకాల్లో వెయిటేజ్ కల్పించాలన్నారు. అంతే కాకుండా పీటీఐలకు మిగతా ఎస్ఎస్ఏ ఉద్యోగుల వలే 12 నెలల వేతనం అందివ్వాలన్నారు. జీవిత భీమా, ఆరోగ్య భీమాగా రూ.10 లక్షలు, పదవీ విరమణ బెనిఫిట్స్ కింద రూ.10 లక్షలు అందించాలన్నారు.నిరసన దీక్షల్లో భాగంగా సంఘ శ్రేణులు ఎంఈవో కార్యాలయం ఎదుట తమ సమస్యలు పరిష్కరించాలని, డిమాండ్లు నెరవేర్చాలని నినాదాలు చేస్తూ ప్రదర్శలు చేపట్టారు.

సొసైటీల ఆధ్వర్యంలో రైతు పండుగ

సారంగాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల కౌట్ల(బి), ఆలూర్ సొసైటీల ఆధ్వర్యంలో ప్రజా విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రైతు పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ ఛైర్మన్ ఐరా నారాయణ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ. 2 లక్షల రైతు రుణమాఫీ చేయడంతో పాటు అర్హులైన రైతులకు రైతు భరోసా, రైతు బీమా లాంటి పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన సన్న రకం వరి ధాన్యానికి రూ. 500లు బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవోలు మల్లేష్, సలీం, సొసైటీ సిబ్బంది, రైతులు ఉన్నారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి



మానవహారంగా ఐసీటీసీ కౌన్సిలర్లు, విద్యార్థులు

భైంసా, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్ కోసం గాను పోటీతత్వ విధానాలను అలవర్చుకోవాలని ఐసీటీసీ భైంసా ఏరియా ఆసుపత్రి కౌన్సిలర్లు విలాస్, మహిపాల్ రెడ్డిలు పిలుపునిచ్చారు. శుక్రవారం భైంసాలోని సుభద్రవాటిక శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ ఎయిడ్స్ డే కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులు తమ జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకొని లక్ష్యాన్ని చేరుకునేందుకు గాను పాఠశాల స్థాయి నుంచే ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. సమయాన్ని సద్వినియోగం చేసుకొని పరీక్షలకు సన్నద్ధమై ఉత్తమ ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. ఇందులో శ్యూర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ధనలక్ష్మి, విజయ, ప్రేమలతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవేందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. ఇందులో భాగంగా పాఠశాల ఆవరణలో ఐసీటీసీ కౌన్సిలర్లు, శ్యూర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్రదర్శనలు చేపట్టారు.

కేసీఆర్ ఉద్యమ ఫలితమే.. తెలంగాణ

● మాజీ ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్ ● ఘనంగా బీఆర్ఎస్ దీక్షా దివస్ కార్యక్రమం



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న, వేదికపై పీజీగౌడ్

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కేసీఆర్ ఉద్యమ ఫలితమే.. నేటి తెలంగాణ అని.. బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన దీక్షా దివస్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొదటగా అమరవీరుల స్థూపం, తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేసీఆర్ కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, జడ్పీ మాజీ ఛైర్మన్ జనార్ధన్ రాథోడ్, జిల్లా ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్ మాట్లాడుతూ .కాంగ్రెస్ ప్రభుత్వం 420 బూటకపు హామీలు ఇచ్చి గద్దెనెక్కి వాటి అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో అవగాహన రహిత పరిపాలన జరుగుతోందని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో అనేక అడ్డంకులు ఎదురైనా వాటికి నిలబడి పోరాడిన గొప్ప నేత కేసీఆర్ అని అన్నారు. ఎన్ని ఉద్యమాలు చేసినా ఆనాడు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇవ్వడానికి సుముఖత చూపలేదన్నారు. దాదాపు పన్నెండు వందల మంది అమరులు అసువులు బాసిన తర్వాత తెలంగాణ ప్రకటన చేశారని గుర్తు చేశారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో పథంలో దూసుకెళ్లిందని గుర్తు చేశారు.

రాజీనామా చేసి ఉద్యమబాట పట్టా..

● మాజీ మంత్రి జోగు రామన్న

స్వరాష్ట్రం కోసం పోరాటం తప్పదని టీడీపీ పార్టీకి రాజీనామా చేసి.. ఉద్యమంలో భాగస్వాములు అయినట్లు మాజీమంత్రి జోగు రామన్న తెలిపారు. టీడీపీలో ఉంటూ కూడా ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ ఎదుట దీక్ష చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణను సాధించడం కేసీఆర్‌తో సాధ్యమా అన్న సందేహాలకు సమాధానంగా ఆయన రాష్ట్రాన్ని సాధించి చూపారని, పదేండ్ల పాలనలో పురోగతి పథంలో రాష్ట్రం నడిచిందని అన్నారు. 2009 డిసెంబర్ 9న పార్లమెంట్‌లో తెలంగాణ ప్రకటన చేస్తే అప్పటి ఆంధ్ర పాలకులతో సహా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం ఆ నిర్ణయానికి అడ్డం పడ్డారని, వారి కారణంగానే తిరిగి తెలంగాణ ప్రకటనను వెనక్కి తీసుకున్నారని గుర్తు చేశారు. ఆనాటి నుంచే కేసీఆర్ లేకుంటే ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి కూడా ఉండేవాడు కాదన్నారు. అన్ని వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలు నిర్వహించడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు.

కేసీఆర్‌ను తిట్టే హక్కు రేవంత్‌కు లేదు..

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

కేసీఆర్‌ను తిట్టే హక్కు రేవంత్‌కు లేదని, మీకు దండంపెడ్తా మా నాయకుడిని తిట్టొద్దని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మా నాయకుడు గురించి తెలుసుకుని మాట్లాడాలని అన్నారు. ఉద్యమకాలం నాటి రోజులను గుర్తు చేస్తూ 2001 నుంచి తాను తెలంగాణ ఉద్యమంలో పోషించిన పాత్రను వివరిస్తూ ఆనాటి రోజులను మరోసారి మననం చేసుకున్నారు. ఎన్నో కష్టాలకు ఎదురొడ్డి తెలంగాణను సాధించి పురోగతి పథంలో నడిపినట్లు తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పరిస్థితులు తలకిందులు అయ్యాయని ఉదాహరణలతో సహా వివరించారు. కేసీఆర్ అనునిత్యం రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం తపించే నాయకుడిని, ఆయనపై అర్ధరహిత విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. రానున్న ఎన్నికల్లో వందకు వందశాతం వంద సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ఉద్యమ జ్ఞాపకాలతో ఎల్ఈడీ ప్రదర్శన..

తెలంగాణ రాష్ట్ర సాధనకు చేసిన పోరాటాలను గుర్తు చేస్తూ కేసీఆర్ ఆమరణ దీక్షతో పాటు రాష్ట్రాభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దీక్షాదివస్‌ను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఉద్యమకాలంలో ఎదుర్కొన్న సవాళ్లు, అడ్డంకులను అధిగమించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన వైనం, పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో సాధించిన ప్రగతి, కేసీఆర్ అమలు చేసిన బృహత్తర పథకాలు తదితర అంశాలతో కూడిన వీడియోను వీక్షించారు. ఉద్యమ జ్ఞాపకాలు ప్రగతిని వివరించారు. తెలంగాణ ప్రగతి పథాన్ని వివరించేలా కళాకారులూ ఆలపించిన గీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ జోగు ప్రేమేందర్, నాయకులు అజయ్, రౌత్ మనోహర్, రోకండ్ల రమేష్, నారాయణ, లింగారెడ్డి, సాజిదొద్దీన్, యాసం నర్సింగ్‌రావ్, యూనిస్ అక్బాని, చారులత, తుల శీను, సతీష్ పవర్, గంద్రత్ రమేష్, సెవ్వ జగదీష్, మెట్టు ప్రహ్లాద్, పరమేశ్వర్ పాల్గొన్నారు.

పారిశ్రామిక పర్యటనతో విద్యార్థులకు నూతన అనుభవం

● బాసర ట్రిపుల్‌ఐటీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ ● పరిశ్రమలను సందర్శించిన ఆర్జీయూకేటీ విద్యార్థులు

బాసర, నవంబర్, 29 : (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక పర్యటన విద్యార్థులకు నూతన అనుభవం ఇస్తుందని బాసర ట్రిపుల్ ఐటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ అన్నారు. పారిశ్రామిక పర్యటనలో భాగంగా ఆర్జీయూకేటీకి చెందిన ఇంజనీరింగ్ నాలుగవ సంవత్సర విద్యార్థుల బృందం శుక్రవారం పయనమవుతున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇండస్ట్రియల్ టూర్ ద్వారా ఆర్జీయూకేటీ విద్యార్థులకు అనుభవం పరిశ్రమకు పరిచయం చేసే ప్రయత్నాలలో భాగంగా ఇటువంటి కార్యక్రమాలు తమ విద్యార్థులు ఉపాధి పొందేందుకు, పరిశ్రమలకు స్థాపనకు సిద్ధంగా ఉండటానికి సహాయపడతాయని అన్నారు. విద్యార్థులు నేర్చుకుని ఎదగడానికి అత్యుత్తమ అవకాశాలను అందించడానికి కట్టుబడి ఉన్నామని, విద్యాసంస్థలకు, పరిశ్రమలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు ఇండస్ట్రీయల్ టూర్ మాక్ ఇంటర్వ్యూ సేషన్‌లు మా ప్రయత్నాల్లో భాగమని చెప్పారు. ఇండస్ట్రియల్ టూర్, మాక్ ఇంటర్వ్యూ, సెషన్‌లో పాల్గొన్న విద్యార్థులు విశ్వవిద్యాలయ పరిపాలన తమకు అతిథ్యం ఇచ్చిన సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అనుభవం అమూల్యమైనదని, పరిశ్రమపై తమకు కొత్త విషయ కోణాన్ని తెలుసుకునే అవకాశం ఏర్పడిందని విద్యార్థులు తమ అనుభవాన్ని తెలిపారు. అనంతరం హైదరాబాద్‌లోని డీఎల్ఎఫ్, ఐఎస్‌వో, రహేజా కాగ్నిజెంట్‌తో సహా ప్రముఖ కంపెనీల్లో సందర్శించారు. పారిశ్రామిక పర్యటనలో విద్యార్థులు మాక్ ఇంటర్వ్యూ సెషన్‌లో పాల్గొని ఇంటర్వ్యూలకు ఎలా హాజరవ్వాలి వారి ఉపాధి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలనే దానిపై నిపుణులు విలువైన చిట్కాలు, మార్గదర్శకత్వం అందించారు. ఈ కార్యక్రమంలో అధికార సిబ్బంది సృజన, శంకర్, పద్మశ్రీ, ఎస్ విజయ్, ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.



మాక్ ఇంటర్వ్యూలో విద్యార్థులు

ఇథనాల్ అనుమతుల పాపం బీఆర్ఎస్, బీజేపీలదే : కాంగ్రెస్

కేటీఆర్, ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిల దిష్టిబొమ్మల దహనం



దిలావర్‌పూర్‌లో కేటీఆర్, ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిల దిష్టిబొమ్మలు దహనం చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

దిలావర్‌పూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇథనాల్ పరిశ్రమ నిర్మాణానికి అనుమతుల పాప అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం, బీజేపీలదేనని దిలావర్‌పూర్ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ బొల్ల దయాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నిర్మల్ బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ అనుచిత్య వ్యాఖ్యలు చేయడం గర్హనీయమన్నారు. రాజకీయాల్లో బూతు మాటలు ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. ముఖ్యమంత్రి పట్ల హుందాగా వ్యవహరించాలని లేదంటే మాటకు మాట జవాబు చెబుతామన్నారు. దిలావర్‌పూర్‌లో ఇథనాల్ పరిశ్రమకు అప్పట్లో పునాదులు వేసిందే కేటీఆర్ అని ఇప్పుడు గుమ్మడి కాయల దొంగ అంటే భుజాలు తడుముకున్నట్లు నంగనాచి మాట్లాడుతున్నారన్నారు. మరో వైపు బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఇథనాల్ రద్దు చేయించాలని ఇంటికి వెళ్లిన రైతులకు కోర్టుకు వెళ్తే నేను సహకరిస్తానని చెప్పడం దారుణమన్నారు. ప్రజాకోర్టులో ప్రజలే న్యాయ నిర్ణేతలన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అసెంబ్లీలో దిలావర్‌పూర్ ఇథనాల్‌పై ఒక్క మాట మాట్లాడకుండా ఓట్లేసి గెలిపించిన ప్రజలను మోసం చేశారన్నారు. లగచర్లలో జరిగిన ఘటనపై స్పందించి ఉరికిన మహేశ్వర్‌రెడ్డికి దిలావర్‌పూర్‌లో ఉన్న రైతులు కనిపించలేదా అని ప్రశ్నించారు. ప్రజాభిప్రాయానికి గౌరవం ఇవ్వకపోతే ఎంతటి వారికైనా సమాధి తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మనోహర్ రావు, కట్కం రాజారెడ్డి, అర్గుల రమణ, కోడె విజయ్‌కుమార్, నిర్మల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాయన్న, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్, మండల మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు సలీం, రమాకాంత్, బీరప్ప, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లాలో కుష్టు వ్యాధిని నిర్మూలించాలి

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్

నిర్మల్ అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కుష్టువ్యాధి నివారణకు ప్రతీ ఒక్కరూ అంకితభావంతో పని చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో లెప్రసీ వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమంపై శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కోరారు. కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించడానికి డిసెంబరు 2వ తేదీ నుంచి డిసెంబరు 15వ తేదీ వరకు కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమం నిర్వహణ అధికారులు డాక్టర్ రవీందర్‌రెడ్డి, డాక్టర్ సౌమ్య, డిప్యూటీ జిల్లా విస్తరణ మీడియా అధికారి బారె రవీందర్, డీపీఎంవోలు రాజేశ్వర్, గంగన్న, లెప్రా ఇండియా ఫిజియోథెరపిస్ట్ కిషన్‌రావు, జిల్లాలోని వైద్యాధికారులు, ఆరోగ్య విస్తరణ అధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో విద్యార్థుల మరణాలపై జాతీయ బాలల హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు



న్యాయవాది కొండ సాయిప్రసాద్

భైంసా, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ గురుకులాలు, వసతి గృహాల్లో వరుసగా చోటు చేసుకుంటున్న విద్యార్థుల మరణాలకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జాతీయ బాలల హక్కుల కమీషన్‌కు ఫిర్యాదు చేసినట్లుగా భైంసాకు చెందిన న్యాయవాది కొండ సాయి ప్రసాద్ తెలిపారు. శుక్రవారం సంబంధిత విషయంలో హైదరాబాద్ నుంచి విలేకరులకు ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలిపారు. గత సంవత్సర కాలంగా కల్తీ ఆహారం మూలంగా 38 మంది విద్యార్థులు మృతి చెందగా వేలాది విద్యార్థులు అస్వస్థత, అనారోగ్యపు సమస్యల బారిన పడి ఆసుపత్రుల పాలయ్యారని ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న బాధ్యతారాహిత్య వైఖరి విధానాలు, నిర్లక్ష్యపు చర్యల మూలంగానే వసతి గృహాలు, గురుకులాల్లోని విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల మరణాలను నివారించేందుకు, కల్తీ ఆహారం నిరోధించేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టకపోవడం మూలంగానే ఘటనలు పునరావృతం అవుతున్నాయన్నారు. జాతీయ బాలల హక్కుల కమిషన్ స్పందించి సంబంధిత ఘటనలపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి విద్యార్థుల మరణాలకు కారకులైన బాధ్యులందరి పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు తగు రీతిలో న్యాయం చేయాలన్నారు. ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులు గణితంలో మెళకువలు నేర్చుకోవాలి

సోన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు గణితంలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ మెళకువలు నేర్చుకోవాలని వీటిని వెలికి తీసేందుకు గణిత ప్రతిభ పోటీలు టీఎంఎఫ్ నిర్వహిస్తుందని సోన్ ఉన్నత పాఠశాల ప్రధానోద్యాయురాలు ఆరాధన తెలిపారు. తెలంగాణ గణిత ఫోరం (టీఎంఎఫ్) ఆధ్వర్యంలో మండల స్థాయి పోటీలు సోన్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల పదో తరగతి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వీరు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. తెలుగు మాధ్యమంలో జాఫ్రాపూర్, పాక్‌పట్ల పాఠశాల విద్యార్థులు శ్వేత ప్రథమ, వైష్ణవి, ప్రశాంత్ ద్వితీయ, ఆంగ్ల మాధ్యమంలో సోన్ విద్యార్థులు రిషిత ప్రథమ, సాయికృష్ణ ద్వితీయ, వెల్మల్ బొప్పారం విద్యార్థి మాధురి తృతీయ స్థానాలను సాధించారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాసర గుడిలో కార్తీక దీపారాధన



బాసర ఆలయంలో దీపాలను వెలిగిస్తున్న దృశ్యం

బాసర, నవంబర్, 29 : (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం పురస్కరించుకొని బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో దీపారాధన కార్యక్రమం కొనసాగుతుంది. కార్తీక మాసం చివరి శుక్రవారం పురస్కరించుకొని రాత్రివేళ దీపాలను వెలిగించారు. శివ లింగం, వివిధ ఆకృతుల్లో దీపాలను అలంకరించారు. భక్తులు పాల్గొని దీపారాధన పూజలు నిర్వహించారు.

మన్మథ్ గ్రామంలో ముగిసిన అఖండ సప్త వేడుకలు



స్వామివారి పల్లకీ సేవ

లోకేశ్వరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మన్మథ్ గ్రామంలో గత వారం నుంచి కొనసాగుతున్న సప్త వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. శుక్రవారం ఉదయం నుండే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులందరూ తమ మొక్కులను తీర్చుకునానరు. అలాగే స్వామివారిని అలంకరించి గ్రామంలోని పలు వీధుల గుండా సన్నాయి డప్పు చప్పుళ్లతో స్వామివారిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ప్రజలందరూ పాల్గొన్నారు. తదనంతరం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా లోకేశ్వరం ఎస్సై అశోక్ గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ చాటిన దివ్యాంగులు



బహుమతులు అందుకుంటున్న వికలాంగులు

నిర్మల్ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో గత రెండు రోజులుగా నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో నిర్మల్ జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. వికలాంగుల డైరెక్టర్ వీరికి బహుమతులు అందజేశారు. కే. ముఖేష్, పి. దేవుబాయి, రాకేష్, పి. ఆనంద్ రావు, ఏ. శ్రీవల్లి, పలు పోటీల్లో గెలుపొందారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ క్రీడాకారులను అభినందించారు.

పెండింగ్ నిధులు విడుదల చేయాలి : సీపీఎం

నిర్మల్ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని సీపీఎం డిమాండ్ చేసింది. శుక్రవారం జిల్లా నాయకులు మాట్లాడుతూ... గత ప్రభుత్వం హయాంలో మాజీ సర్పంచ్‌లు అప్పులు చేసి పనులు పూర్తి చేశామని తెలిపారు. బిల్లు రాక వారంతా తీవ్ర మనోవ్యధకు గురై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. శంభు, పోశెట్టి, ఆనందరావులు స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెంబి మాజీ సర్పంచ్ పూర్ణచందర్ గౌడ్‌ను పరామర్శించారు.

అదృశ్యమైన విద్యార్థిని అప్పగించిన పోలీసులు

ఇచ్చోడ, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల గిరిజన గురుకుల కళాశాల వసతిగృహం నుంచి అదృశ్యమైన విద్యార్థిని పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ఆచూకీ తెలుసుకుని కళాశాల యాజమాన్యానికి అప్పగించిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఇచ్చోడలో ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్న ఓ విద్యార్థిని ఈనెల 23న ఇంటికి వెళ్లి తిరిగి గురువారం కళాశాలకు హాజరైంది. హాజరైన విద్యార్థి కళాశాలకు వచ్చిన గంటలోనే బయటికి వెళ్లింది. గమనించిన విద్యార్థులు కళాశాల సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో యాజమాన్యం విద్యార్థి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. శుక్రవారం వరకు విద్యార్థి ఆచూకి లభ్యమవ్వకపోవడంతో స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఎస్సై దర్యాప్తును వేగంగా చేయడంతో బాలికను గంటల వ్యవధిలోనే పట్టుకోవడం జరిగింది. విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపల్ రోజారాణికి అప్పగించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

ప్రజాపాలన విజయోత్సవాలు

సిరికొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలన-ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మండలంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు కళాజాత బృందం అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం డీపీఆర్వో ఆధ్వర్యంలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా సిరికొండ, కొండాపూర్, రాజంపేట్, తదితర గ్రామాల్లో కళాజాత బృందం తమ ఆటపాటలతో 6-గ్యారంటీలు, పలు అభివృద్ధి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు ప్రధానంగా ప్రభుత్వ గ్యారంటీలలో భాగంగా అమలు చేస్తున్న ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ కవరేజీ రూ.10 లక్షలకు పెంపు, ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటు, రూ.2 లక్షల రైతు రుణమాఫీ అమలు, తదితర పథకాలపై ప్రజలకు అవగాహన పరిచారు. కార్యక్రమంలో ఎంపీవో సంతోష్, పంచాయతీ కార్యదర్శులు అరుణ్ కుమార్, శ్రీనివాస్, అరుణ్, కళాజాత బృందం సభ్యులు ఆత్రం గోవింద్‌రావ్, రాథోడ్ శంకర్, గోడం ఆశీష్, నగేష్, దుర్పతబాయి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దత్త మహాయజ్ఞం



స్వామిజీ అనుగ్రహభాషణాన్ని వింటున్న భక్తులు

కుంటాల, నవంబర్, 29 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింబా(బీ) గ్రామంలో శుక్రవారం దత్త మహాయజ్ఞం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 108 జంటలు ఈ యజ్ఞంలో పాల్గొన్నారు. శ్రీ శ్రీ శ్రీ విద్యారంగ భారతి మహాస్వామి హంపి కర్ణాటక పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య పాల్గొని భక్తులకు పలు రకాల ప్రవచనాలు బోధించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

బాసర, నవంబర్, 29 : (ఆంధ్రజ్యోతి) : బాసర మండల కేంద్రంలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి (65) చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గోదావరి రైల్వే వంతెన సమీపాన చెట్టుకు వేలాడుతున్న వ్యక్తిని చూసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. తెల్లని దోతి, షర్టు ఉందని తెలిసిన వాళ్లు బాసర పోలీసులకు సంప్రదించాలని కోరారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు.

చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలిచే కట్టడాల్లో సుమారు ఐదు వందల ఏళ్ల క్రితం నిర్మించినా నేటికీ చెక్కుచెదరకుండా ఉండే భవనం ఎక్కడ ఉందం టే నిర్మల్ జిల్లా నియోజకవర్గమైన ముథోల్‌లో ఉందంటే నమ్మశక్యం కాని నిజం. నేటి ఇంజ నీర్లకు సవాల్ విసురుతున్న కట్టడాల్లో ఈ భవంతి ఒకటి అని చెప్పుకోవచ్చు. సుమారు 465 ఏళ్ల క్రితం మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో బంక మట్టి, డంగు సున్నంతో నిర్మించిన భవనం నేటికీ చెక్కు చెదరకుండా ఉంది. అంతేకాకుండా ఇందులో ఉన్న కుటుంబీకులు సైతం నేటికీ ఉ మ్మడి కుటుంబం గానే ఉంటూ ప్రతి శుభకార్యా న్ని ఇదే భవనంలో జరుపుకుంటున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

అపూర్వం.. ఈ భవనం

స్పెషల్ స్టోరీ

- ఐదు శతాబ్దాలుగా నిలిచి ఉన్న ఇల్లు
- 3.5 ఎకరాల్లో నిర్మించిన భవనం
- గతంలో 18 గ్రామాలకు పాలన కేంద్రం
- నేటికి ఉమ్మడి కుటుంబం
- ఎన్ని ఇబ్బందులు వచ్చినా.. కాపాడుకుంటామంటున్న వారసులు


ఐదు వందల ఏళ్ల క్రితం నిర్మించిన ఇల్లు

ముథోల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి)

నిర్మల్ జిల్లా ముథోల్ మండల కేంద్రంలో సుమారు 465 ఏళ్ల క్రితం నిర్మితమైన ఇల్లు నేటికీ చెక్కుచెదరని ఆశ్చర్య చకితులను చేస్తుంది. ముథోల్‌లో ప్రస్తుతం దిగంబర్ రావు దేశ్ పాండే ఆధీనంలో ఉన్న ఇల్లు నాటి పని తనానికి నిదర్శనంగా నిలుస్తుంది. ఇంట్లో కర్రతో తయారు చేసిన గుర్రం పేడతో తయారు చేసిన గరుడ విగ్రహం నేటికీ ఉన్నాయి. స్తంభాలు, తలుపులపై వడ్రంగులు చెక్కిన చిత్రాలు కళాఖండాలు చూపరులను ఆకర్షిస్తున్నాయి. పూర్వీకులు దాదాపు 465 సంవత్సరాల క్రితం మూడున్నర ఎకరాల విశాల స్థలంలో ఈ ఇంటిని నిర్మించారు. ఇంటిలో 25 గదులున్నాయి. మొదట మట్టితో నిర్మించిన అనంతరం డంగు సున్నంతో మరమ్మతులు చేయించారు. ఇక్కడనే డంగు సున్నాన్ని తయారు చేయడానికి ఉపయోగించిన గుండ్రటి రాతి పలక సైతం నేటికీ చెక్కు చెద రకుండా కనబడుతున్నాయి. ఆనాడు నిర్మించిన భవంతి నేడు చెక్కుచెదర కుండా మనకు దర్శన మిస్తున్నాయి. అంతేకాకుండా ఈ భవనం ముందు తమ పూర్వి కులు నిర్మించిన ఆంజనేయ ఆల యం సైతం నేటికీ చెక్కు చెదర కుండా ఉంది.

18 గ్రామాలకు కేంద్ర బిందువు..


దిగంబర్ రావు దేశ్ పాండే రెండో కుమారుడు గోవింద్ రావు దేశ్ పాండే, ఆరవ కుమారుడు గణేష్ రావు దేశ్ పాండే, చిన్న కుమారుడు రాజేశ్వర్ రావు దేశ్ పాండ్‌లు మాట్లాడుతూ.. తమ తాత ముత్తాతలు ఎల్వి, దోహగాం, కోలూరు, అబ్దుల్లాపూర్, వాస్తాపూర్, వడ్తాల్, తదితర 18 గ్రామాలను పాలించినట్లు తెలిపారు. ఆ సమయంలోనే ఈ ఇంటిని నిర్మించారని తమ పెద్దవాళ్లు చెప్పారన్నారు. సుమారు 25 కిలో మీటర్ల వరకు సొరంగ మార్గం ఉండేదని ఇదే భవంతిలో ఉన్న బావిలో ఒక గది సైతం ఉందని పూర్వీకులు తెలిపినట్లు వారు వివరించారు. ప్రస్తుతం ఆ బావి ఆనవాళ్లు నేటికీ ఉంది.


డంగు సున్నాన్ని తయారు చేయడానికి ఉపయోగించిన గుండ్రటి రాతి పలక


గరుడ విగ్రహం


స్తంభాలకు కర్రతో చేసిన కళాకృతులు




ఇంటిలో లోపల చెక్కు చెదరకుండా ఉన్న స్తంభాలు

కళాఖండాలకు నిలయం..

ఈ ఇంటిలో అడుగు పెడితే ప్రతి గోడ కళాఖండాలు దర్శనమిస్తాయి. కొయ్యతో చేసిన గుర్రం పేడతో తయారు చేసిన గరుడ విగ్రహం, తలుపులకు, స్తంభాలకు కర్రతో చేసిన కళా కృతులు దర్శనమిస్తాయి. గోడకు ఉన్న ప్రతి రాయిలో కళా నైపుణ్యం ఉట్టిపడుతుంది. 10 సంవత్సరాల క్రితం పల్లె సృజన సోదయాత్రలో భాగంగా మాజీ ఎమ్మెల్సీ చుక్క రామయ్య సైతం ఈ ఇంటిని పరిశీలించారు. గతంలో బెంగుళూరు నుంచి పురావస్తు శాస్త్రజ్ఞులు వచిచ ఇంటిని పరిశీలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రతీ సంవత్సరం సుమారు లక్ష రూపాయలు ఖర్చు చేసి మరమ్మతులు చేస్తూ ఇంటిని కాపాడుకుంటున్నామని వారు తెలిపారు. ఇక్కడ ప్రాంతంలో మా తాత ముత్తాతలు ఇచ్చిన ఆస్తి అని దీనిని తరతరాలుగా ఐదు శతాబ్దాల నుండి కాపాడుకుంటూ వస్తున్న ఇంటిని మా పిల్లలు సైతం మా దారుల్ని అనుసరిస్తారని వారు పేర్కొన్నారు. ఈ ఇంటిని కాపాడుకోవడంతో మా తాత ముత్తాతల పేరు ప్రఖ్యాతలు నిలపడం మా అదృష్టం అన్నారు.

నేటికీ ఉమ్మడి కుటుంబం..

దిగంబర్ రావు దేశ్ పాండేకు ఏడుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు. ఆయన కుమారులు ఏడుగురు ఇప్పటికీ ఉమ్మడి కుటుంబంగా ఉంటున్నారు. వీరిలో ఉద్యోగరీత్యా కొందరు ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్నప్పటికీ ప్రతీ పండుగకు ప్రతీ కార్యానికి ఇక్కడికి వస్తుంటారు. ఈ కుటుంబ సభ్యులు కొందరు హైదరాబాద్‌లో మరికొందరు మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతంలో ఉద్యోగరీత్యా ఉన్నప్పటికీ దసరా, దీపావళి, సంక్రాంతితో పాటు తదితర పండుగలకు ప్రత్యేకంగా కుటుంబ సమేతంగా ఇక్కడి భవనంలో వచ్చి పండుగలను జరుపుకుంటారు. ఈ భవంతిలో దిగంబర్‌రావు దేశ్ పాండే, ఇద్దరు కుమారులు ముథోల్‌లోని ఈ భవనంలో ఉంటారు. మిగతా వారందరూ ప్రతీ కార్యానికి ముథోల్‌కు వచ్చి ఈ పెద్ద భవంతిలో జరుపుకుంటారు.

పెద్దల ఆనవాళ్లను భద్రంగా ఉంచుతాం..



● గోవింద్ రావు దేశ్ పాండే

మా తాత ముత్తాతలు సుమారు మూడున్నర ఎకరాల ప్రాంతంలో ఐదు శతాబ్దాల క్రితం నిర్మించిన ఈ ఇంటిని ఆనవాళ్లను భద్రంగా ఉంచుతాం. ఇంటికి ప్రతి సంవత్సరం మరమ్మతులు చేయించి కాపాడుకుంటున్న నేటి ఇంజనీర్లకు సవాల్‌గా నిలిచిన ఈ భవనం నిర్మాణం కాపాడుకోవడంలో ఉన్న ఆనందం మరి దేంట్లో లేదు. మాకు ఇంత పెద్ద భవనాన్ని అందించిన మా తాత ముత్తాతలకు సర్వదా రుణపడి ఉంటాం.

ఈ భవనం మాకు గర్వకారణం..



● గణేష్ రావు దేశ్ పాండే

మా తల్లిదండ్రులు తాత ముత్తాతలు మాకు అప్పజెప్పిన వారసత్వ సంపదను నేటికీ సజీవంగా ఈ భవనం ఉండడం మాకు గర్వకారణం. ఈ ఇంట్లో శతాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనంలో ఇప్పటికీ మేమందరం కలిసి ఉండటం సంతోషకరమైన విషయం. మా పిల్లలు సైతం ఇదే ఇంట్లో ఉంటూ పూర్వీకుల వారసత్వ సంపదను రక్షించాలని మా అందరి కోరిక.

మా పిల్లలకు ఈ భవనం ప్రాణం..



● రాజేశ్వర్ రావు దేశ్ పాండే

సుమారు 465 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనంలో మే ము నివసించడం మాకు సంతోషదాయకం, ఆనందమని, ఈ భవనం అంటే మా పిల్లలందరికీ చాలా ప్రాణం. ప్రతి ఏ చిన్న శుభకార్యం చేసిన ఇక్కడికి వచ్చి ఈ భవనంలో చేసు కుందామని వస్తారు. మా పిల్లలు, మేము ప్రతి ఒక్కరూ ఏ కాలం ఏ పుణ్యం చేస్తున్నామో మా తాత ముత్తాతలు నిర్మించిన భవనంలో నేటికీ నివసిస్తున్నామంటే మాకు మా అదృష్టంగా భావిస్తున్నాం. ఏదేమైనప్పటికీ వందల ఏళ్ల క్రితం నిర్మించిన భవనలో ఉంటున్నామంటే కొందరికి నమ్మశక్యం కాదు. కానీ ఇది నిజం. మాకు సంతోషం.

మా పూర్వీకుల వరప్రసాదం ఈ భవనం..



● జ్యోతి దేశ్ పాండే

మా పూర్వీకులు ఇచ్చిన వరప్రసాదం ఈ భవనం. ఇదివరకు ఈ భవనం నుండి సుమారు 18 గ్రామాలు పరిపాలించిన తాత ముత్తాతలు, మా మామయ్యలు అందరూ ఇదే భవనంలో నివసించి వంశపారపరంగా మాకు లభించిన వార సంపద. ఈ పెద్ద భవనంలో ఇందులో ఉండం మా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాం.

మా జన్మ ధన్యం..



● సుజాత దేశ్ పాండే

ఒక చరిత్ర కలిగిన మా కుటుంబం నేటికీ ఉమ్మడిగా ఉండటం సంతోషకరం. మా పెద్దలు నిర్మించిన ఇంటిలో నివసించడం సుమారు 500ల సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ భవనంలో మేము ఉండడం అదృష్టంగానే భావిస్తున్నాం. మా పిల్లలు సైతం ఇదే బాటలో పయనిస్తారని మా ఆశ.

మా ముత్తాతల ఆస్తిని కాపాడుకుంటాం..



● అక్షయ్ దేశ్ పాండే

మా ముత్తాతల ఆస్తి నేటికి భద్రంగా కాపాడుకుంటాం. మా తాతలు మా నాన్నలు ఎలా అయితే కాపాడుకున్నారో మేము సైతం కాపాడుకుంటాం. నేను హైదరాబాద్‌లో ఇంజనీర్‌గా పని చేసినప్పఇకీ ప్రతీ పండుగలకు, శుభకార్యాలకు ముథోల్‌కి వచ్చి ఈ భవనంలో జరుపుకోవడం మాకు ఎంతో సంతోషం కలిగిస్తుంది. కాబట్టి నేటికీ చెక్కుచెదరకుండా ఈ భవనాన్ని మా తల్లిదండ్రులు ఎట్లా కాపాడారో మేము కూడా అదే బాటలో పయనిస్తూ అలాగే ఒక చరిత్ర సృష్టించే విధంగా ఈ భవనాన్ని మరమ్మతులు చేసి భద్రంగా ఉంచుతాం. ఇదివరకే వివిధ పరిశోధకులు, తదితరులు వచ్చి చూసి వెళ్లారు. ఈ భవనం నేటికీ ఇలా భద్రంగా ఉందంటే ఆశ్చర్యం వ్యక్తం చేయడం మాకు సంతోషం కలిగిస్తుంది. ఈ ఇంటిని నిర్మించిన మా పెద్దలకు సదా నమస్కరిస్తున్నాను.


భరతనాట్యం చేస్తున్న చిన్నారులు

అమ్మవారికి కళార్చన

బాసర, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బాసర సరస్వతి అమ్మవారి సన్నిధిలో పాఠశాల స్థాయి విద్యార్థినుల కూచిపూడి భరతనాట్యం ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణంలో రెండు రోజుల నుంచి తెనాలి, విజయవాడ, హైదరాబాద్‌కు చెందిన చిన్నారులు తమ నృత్యంతో అమ్మవారికి కళార్చనలో పాల్గొన్నారు. వివిధ భక్తి గీతాలపై చేసిన ప్రదర్శనలు భక్తులను కనువిందు చేశాయి. అధికారులు కొత్తగా కళార్చనలో కళాకారులు ఎవరైనా అమ్మవారి చెంత ప్రదర్శించేందుకు ప్రోత్సహిస్తున్నారు. ఇందులో భాగంగా కొన్ని రోజుల నుంచి వివిధ ప్రాంతాల నుంచి వచ్చి అమ్మ వారి సన్నిధిలో ప్రదర్శిస్తున్నారు.


నృత్యం చేస్తున్న చిన్నారి


పెద్దపులి సంచరిస్తున్నట్లు అనుమానిస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

తిరుపెల్లి సమీపంలో

పెద్దపులి సంచారం

- రోడ్డు దాటుతున్న పెద్దపులి వీడియో సోషల్ మీడియాలో వైరల్

లక్ష్మణచాంద, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపెల్లి గ్రామ పరిధిలోని దిమ్మదుర్తి అటవీ రేంజ్‌లోని ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు ఒక వీడియో సోషల్ మీడియాలో శుక్రవారం ఒక సంచలనం రేపింది. ఇందుకు సంబంధించి సంబంధిత ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ టి.శ్రీనివాస్ రావును వివరణ కోరగా అలాంటి ఆనవాళ్లు ఏమీ లభించలేదని సమాధాన మిచ్చారు. స్థానిక గ్రామస్తులు పెద్దపులి సంచరించిందని మాట్లాడిన వాయిస్ రికార్డ్‌ను అయనకు పంపగా ఫారెస్ట్ ఆఫీసర్ దండు శ్రీనివాస్ ఇతర సిబ్బందితో కలిసి వచ్చి పులి సంచరిస్తున్నట్లు అనుమానిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించి ఎలాంటి పులి సంచరించలేదని వెల్లడించారు. కానీ పులి సంచరించినట్లు ఇసుకలో పులి పాదముద్రలు ఉన్నట్లు సమీప గ్రామస్థులు గుర్తించారు. అయినప్పటికీ అటవీ శాఖ అధికారులు మాత్రం దీన్ని ధ్రువీకరించటం లేదు. కానీ మండలంలోని తిరుపెల్లికి దాదాపు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న బోరిగాం గ్రామంలో చిరుత పులి ఇటీవలే సంచరించినట్లు అటవీ శాఖ అధికారులు ధ్రువీకరించటం గమనించదగినది.


ఇసుకలో పాద ముద్రలు ఉన్న చిత్రాలు

అర్లి(టి)లో అత్యల్ప ఉష్ణోగ్రత

- రాష్ట్రంలోనే 8.2 అత్యల్ప ఉష్ణోగ్రతతో రెండో స్థానం


పట్టపగలు చలి మంటలు కాగుతున్న అర్లి(టి) వాసులు

నిర్మానుష్యంగా మారిన అర్లి(టి) గ్రామం


భీంపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్లి(టి) గ్రామంలో శుక్రవారం అత్యల్ప ఉష్ణోగ్రత 8.2 నమోదైంది. ప్రతియేటా ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అవుతోంది. రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రత 8.2 రెండవ స్థానంలో ఉంది. చుట్టూరా కొండలు, వాగులు, వంకలు, పెన్ గంగానది పరివాహక ప్రాంతం ఉండటం ఒక కారణం అయితే ఈ గ్రామం కొండలు, గుట్టలలకు లోతైన ప్రాంతంలో ఉండమే కారణమా, లేదా కారణం ఏదైనా కావచ్చు. ప్రతియేటా అర్లి(టి) గ్రామం చలి తీవ్రతను సూచించడం రాష్ట్రంలోనే ప్రత్యేకతను చాటుతోంది.



ఉద్యమ విజయం



నాయకులు కనిపించడం లేదంటూ ప్రదర్శిస్తున్న ఫ్లెక్సీ (ఫైల్)

- వ్యూహాత్మకంగా ఇథనాల్ ఉద్యమం
- గ్రామాభివృద్ధి కమిటీల డైరెక్షన్ సక్సెస్!
- రైతుల పక్షాన నిలిచిన సర్కారు
- గత బీఆర్ఎస్ సర్కార్ అనుమతులపై ఎదురుదాడి
- పల్లెల్లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకాలు

నిర్మల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని దిలావర్‌పూర్ - గుండంపెల్లి గ్రామాల మధ్యన నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా స్థానిక రైతులు, ప్రజలు చేపట్టిన ఉద్యమం విజయవంతమైంది. ప్రజల పోరుబాట రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశమైంది. దాదాపు 7 గ్రామాలు ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమానికి ఆయా గ్రామాల గ్రామాభివృద్ధి కమిటీలు నాయకత్వం వహించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ముఖ్యంగా దిలావర్‌పూర్, గుండంపెల్లి గ్రామాల వీడీసీలే మొదటి నుంచి ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా వివిధ రూపాల్లో ఉద్యమాన్ని నిర్వహించాయి. దాదాపు మూడు నెలల పాటు రిలే నిరాహార దీక్షలను గ్రామాభివృద్ధి కమిటీలు నిర్వహింపజేశాయి. అయితే పరిశ్రమ యాజమాన్యం పనులు వేగవంతం చేయడంతో.. ఇక వీడీసీలు సీరియస్ కార్యాచరణను మొదలు పెట్టాయి. ఇందులో భాగంగానే ఇంటెలిజెన్స్ వర్గాలకు గానీ పరిశ్రమ యాజమాన్యానికి గానీ ఎలాంటి అనుమానం రాకుండా ఆందోళనకు సంబంధించి పకడ్బందీ వ్యూహాన్ని అమలు చేశాయి. గత మంగళవారం ఉదయమే దాదాపు 7 గ్రామాల రైతులు, స్థానికులంతా గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో దిలావర్‌పూర్‌కు తరలొచ్చి.. అక్కడి హైవేపై రాస్తారోకోకు శ్రీకారం చుట్టాయి. పోలీసులు సైతం రైతుల రాస్తారోకో సమాచారాన్ని పసిగట్టకుండా చేయడం వెనుక వారి వ్యూహంలో భాగమేనని పేర్కొంటున్నారు. ఎంతగా నచ్చజెప్పినప్పటికీ.. రైతులు మాత్రం ఆందోళన విరమించకుండా బుధవారం సైతం ఉద్యమాన్ని తీవ్రం చేశారు. ఉద్యమ తీవ్రతను, రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం ఎట్టకేలకు పరిశ్రమ నిర్మాణ పనులను నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించే వరకు వీడీసీలు కీలక పాత్ర పోషించాయి.

● అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అనుమతులు

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఈ పరిశ్రమకు అన్ని రకాల అనుమతులు లభించాయి. పరిశ్రమ ఏర్పాటుపై మొదట్లోనే రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ.. అప్పటి ప్రభుత్వం వారి అభిప్రాయాలను పెద్దగా పరిగణనలోకి తీసుకోకుండానే పరిశ్రమకు గ్రీన్‌సిగ్నల్ జారీ చేసింది. మొదట్లో పరిశ్రమ పనుల ప్రారంభాన్ని రైతులు పెద్ద ఎత్తున అడ్డుకోవడమే కాకుండా అక్కడి వాహనాలను అలాగే ఆఫీస్ షెడ్లను ధ్వంసం చేశారు. దీంతో పనులను నిలిపి వేసిన పరిశ్రమ యాజమాన్యం.. రైతులతో, స్థానిక నేతలతో చర్చలు జరిపింది. పరిశ్రమ ఏర్పాటుతో పర్యావరణానికి ఎలాంటి హాని జరగదని, రైతుల పంటలకే ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందంటూ పరిశ్రమ యాజమాన్యం రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసింది. అయితే పరిశ్రమ కారణంగా తమ పచ్చని పంట పొలాలన్నీ కాలుష్యం బారిన పడతాయని, భూగర్భజలాలు సైతం కాలుష్యం అవుతాయని, భవిష్యత్ తరాలకు ఇది ఎంతో నష్టం చేకూరుస్తుందని అంటూ రైతులు పరిశ్రమను వ్యతిరేకిస్తూ వస్తున్నారు. పరిశ్రమకు అవసరమైన అన్ని రకాల అనుమతులను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేయడంతో దీనిపై రైతులు అధికారులకు, అప్పటి అధికార పార్టీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి, అలాగే ప్రజాప్రతినిధులందరికీ ఫిర్యాదులు చేయడమే కాకుండా పరిశ్రమ ఏర్పాటుతో తమకు జరిగే నష్టాన్ని వివరించాయి. పరిశ్రమను వెంటనే ఎత్తి వేయాలని కోరాయి. అయితే అప్పటి ప్రభుత్వ పరోక్ష సహకారంతో యాజమాన్యం మాత్రం పరిశ్రమ ఏర్పాటుపై ధీమాగానే ఉంటూ వచ్చింది. ఇంతలోనే ఎన్నికలు జరగడం, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో కొద్దిరోజుల పాటు యాజమాన్యం సైలెంట్ వ్యూహాన్ని అమలు చేసింది. ఆ తర్వాత పనులను మళ్లీ మొదలు పెట్టింది. రైతులు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ వాటిని పరిగణనలోకి తీసుకోకుండా పనులు యథావిధిగా కొనసాగిస్తోంది. దీనిని రైతులతో పాటు వీడీసీలు సీరియస్‌గా తీసుకున్నాయి.

● స్పందించిన సీఎం రేవంత్‌కు రైతుల క్షీరాభిషేకాలు

ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా స్థానిక రైతులు చేపట్టిన ఆందోళనపై సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పటికే పలు మార్లు డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, ఎమ్మెల్సీ కోదండరామ్‌తో చర్చించారు. గత నాలుగైదు నెలల క్రితమే డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ఇథనాల్ ఫ్యాక్టరీ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. ఆ తర్వాత నిర్మల్ పర్యటనకు వచ్చిన ఎమ్మెల్సీ కోదండరామ్‌కు సైతం ఇక్కడి రైతులు తమ సమస్యలను వివరించారు. దీనిపై స్పందించిన కోదండరామ్.. రైతులకు అండగా ఉంటామని, పరిశ్రమ విషయంలో సీఎంతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై మొదటి నుంచి అవగాహన కలిగి ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం పరిస్థితి తీవ్రతను పరిగణనలోకి తీసుకొని ఆ పరిశ్రమ నిర్మాణ పనులను నిలిపి వేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు. సీఎం స్పష్టమైన హామీ ఇవ్వడంతో రైతులు తమ ఆందోళన విరమించి సంబరాలు జరుపుకున్నారు. గురువారం ఆయా గ్రామాల్లో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకాలు చేసి కృతజ్ఞతలు తెలిపారు.



ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దుతో మహిళా రైతుల సంబురాలు (ఫైల్)

గోదావరి తీరంలో భక్తుల కార్తీక పూజలు



బాసర వద్ద గోదావరి నదిలో భక్తుల పుణ్యస్నానాలు.. గట్టుపైన పూజలు

బాసర, నవంబర్, 29 : (ఆంధ్రజ్యోతి) : బాసర గోదావరి తీరంలో శుక్రవారం భక్తుల సందడి నెలకొంది. కార్తీకమాసం చివరి శుక్రవారం కావడంతో భక్తుల తాకిడి పెరిగింది. ఉదయం నుండి సాయంత్రం వరకు నది స్నాన ఘట్టాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. పవిత్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గంగామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకొని పెద్ద సంఖ్యలో మహిళ భక్తులు కార్తీక దీపాలను వెలిగించి గంగమ్మకు చెల్లించారు. ఒకపక్క నదిలో స్నానాలు ఆచరించే భక్తులు మరోపక్క కార్తీక దీపాలను వెలిగించే భక్తులతో నదీ తీరం కిటకిటలాడింది. ముందుగా నది తీరంలో పూజలు నిర్వహించిన భక్తులు అనంతరం సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. రద్దీ ఎక్కువ కావడంతో దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది.

బ్రహ్మపురి ఆలయంలో పూజలు

నిర్మల్ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లోని బ్రహ్మపురి రథాల గుడిలో శుక్రవారం కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేకపూజలు చేశారు. రుద్రాభిషేకం, పుష్పాలంకరణ, అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదం, అన్న వితరణ చేశారు. పంచాంగ కర్త గడిచెర్ల నాగేశ్వర్ రావు సిద్ధాంతి, తదితరులు పాల్గొన్నారు.



అన్నపూజ చేస్తున్న దృశ్యం

వైభవంగా నారికేళ మహా పడిపూజ



పదునెట్టాంబడిని తీర్చిదిద్దిన భక్తులు.. కళాకారులకు భక్తుల సత్కారం

దిలావర్‌పూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : స్వామియే... శరణం అయ్యప్పా... అనే శరణు ఘోషతో దిలావర్‌పూర్ మండల కేంద్రం మార్మోగింది. అష్టాదశ మహా ఋషి తుల్య (నారికేళ) మహా పడిపూజ మహోత్సవాన్ని అయ్యప్ప భక్తులు మహా పోచమ్మ ఆలయ ప్రాంగణంలో వైభవంగా నిర్వహించారు. స్థానిక అయ్యప్ప భక్తుడు వినయ్ సాగర్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన మహా పడిపూజలో సుమారు వెయ్యి మంది అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులు, మరో ఐదువందల వరకు గ్రామస్థులు పాల్గొన్నారు. అయ్యప్పస్వామి భక్తి గీతాలాపనలతో ఆలయ ప్రాంగణం దద్దరిల్లింది. దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన ఇద్దరు అమ్మాయిల నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. గురుస్వామి చెనిగారపు చిన్నయ్య నేతృత్వంలో అయ్యప్ప స్వామికి పూజాదికాలు చేశారు. అయ్యప్పస్వామి వారికి పంచామృతాభిషేకం చేశారు. భక్తులందరికి పంచామృతం పంచి పెట్టారు. అయ్యప్ప స్వాములకు పాదాభివందనాలు చేశారు. అయ్యప్పకు మొక్కులు చెల్లించుకున్నారు.

ఏసీబీకి పట్టుబడిన సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఉద్యోగులు



ఏసీబీకి పట్టుబడ్డ సర్వే అండ్ ల్యాండ్స్ రికార్డు ఇద్దరు ఉద్యోగులు

నిర్మల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆఫీస్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న గాదరి జగదీష్, అలాగే ఇదే ఆఫీస్‌లో బినామీ అటెండర్‌గా పని చేస్తున్న ప్రశాంత్‌లు పది వేల రూపాయల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. మామడ మండలం ఆదర్శనగర్ గ్రామంలోని 17/3 సర్వే నెంబర్‌కు సంబంధించిన సేత్వార్, టోంచు మ్యాపుల కోసం వీరిద్దరూ పది వేల రూపాయల లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు. నిర్మల్ పట్టణంలోని బుధవార్‌పేట్‌కు చెందిన హరీష్ అనే వ్యక్తి నుండి వీరు లంచాన్ని తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ రమణమూర్తితో పాటు ఇన్స్‌పెక్టర్లు కిరణ్‌కుమార్, పున్నంచందర్, స్వామి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరిద్దరిని కరీంనగర్‌లోని ఏసీబీ కోర్టు ముందు హాజరుపరిచినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. కాగా ఏసీబీకి పట్టుబడ్డ బినామీ అటెండర్ హరీష్ భార్య ఇదే ఆఫీస్‌లో అటెండర్‌గా పని చేస్తున్నారు. ఆమెకు బినామీగా హరీష్ ఇక్కడ అటెండర్ విధులు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ఎవరైనా లంచాలు అడిగితే 1064 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయాలని డీఎస్పీ సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

కేసీఆర్ త్యాగఫలంగానే తెలంగాణ రాష్ట్ర కల సాకారం



మాట్లాడుతున్న శేరి సుభాష్‌రెడ్డి

నిర్మల్ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కేసీఆర్ చేసిన త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కల సాకారమైందని జిల్లా ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లాలోని కొండాపూర్ పార్టీ కార్యాలయంలో దీక్షాదివస్ ఘనంగా నిర్వహించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, కేసీఆర్ చిత్రపటం, అమరవీరుల స్థూపానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ... కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తామని పదేపదే చెబుతున్న కాంగ్రెస్ నాయకులు ఆయన గత చరిత్ర తెలుసుకోవాలన్నారు. మహానుభావుల చరిత్ర చెరిపేస్తే చెరిగేదికాదన్నారు. దేశ స్వాతంత్ర్య సాధనలో మహాత్మాగాంధీ పాత్ర ఎంతో తెలంగాణ సాధనలో కేసీఆర్ పాత్ర అంతే ఉందన్నారు. రాబోయే రోజుల్లో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. జిల్లాకు చెందిన నాయకులు మాట్లాడుతూ... కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ ఉద్యమ ప్రస్థానము తెలియజేశారు. అధైర్యపడకుండా కార్యకర్తలు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ లోలం శ్యామసుందర్, కొరిపెల్లి విజయలక్ష్మి, మాజీ డీసీసీబీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ యూ.సుభాష్‌రావు, పట్టన అధ్యక్షుడు మారుగొండ రాము, ముథోల్ నియోజకవర్గ నాయకులు కే. కిరణ్, జి. విలాస్, పడకంటి రమాదేవి, నజీర్ ఖాన్, ఖానాపూర్ ఇన్‌చార్జ్ జాన్సన్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ మహాసభకు జిల్లా నేతలు

నిర్మల్ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన బీసీ చైతన్య సదస్సుకు నిర్మల్ నాయకులు హాజరయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ దశాబ్దాల పోరాటంతో కుల గణన సాధించుకున్నామని నిర్మల్ జిల్లా బీసీ సంఘ అధ్యక్షుడు అనుముల భాస్కర్ అన్నారు.

అంగన్‌వాడీల్లో పోషకాలతో కూడిన ఆహారాన్ని ఇవ్వాలి

జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నిర్మల్ అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీల్లోని చిన్నారులకు మెరుగైన పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో న్యూట్రి గార్డెన్స్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ న్యూట్రి గార్డెన్స్‌లో పెంచిన ఆకు కూరలు, కూరగాయలను చిన్నారులకు, గర్భిణీలకు, బాలింతలకు అందజేసే ఆహార తయారీకి ఉపయోగించాలన్నారు. ప్రతి ఒక్క చిన్నారి, గర్భిణీ, బాలింతకి మధ్యాహ్న భోజనం, కోడిగుడ్డు, ఇతర పోషకాలను అందించి రక్తహీనత, ఎదుగుదల లోపం వంటి సమస్యలను నియంత్రించాలని తెలిపారు. చిన్నారులకు క్రమం తప్పకుండా బాలామృతాన్ని అందించాలన్నారు. అంగన్‌వాడీల్లో అందించే మధ్యాహ్నం భోజనానికి నాణ్యమైన సరుకులను మాత్రమే వాడాలని తెలిపారు. వస్తువుల గడువు తేదీ ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ ఉండాలన్నారు. చిన్నారులకు స్వచ్ఛమైన తాగు నీరును అందించాలని తెలిపారు. మండలాల వారీగా అంగన్‌వాడీల్లో నిర్వహిస్తున్న న్యూట్రి గార్డెన్స్, సామ్, మామ్ తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా చిన్నారుల ఎత్తు, బరువు వివరాలను నమోదు చేసి నివేదికలను అందజేయాలన్నారు. అంగన్‌వాడీ పరిసరాల్లో నిరంతరం పరిశుభ్రతను పాటించాలన్నారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏసీడీపీవో నాగలక్ష్మి, సీడీపీవోలు నాగమణి, సరిత, సరోజినిలు, జిల్లా సమన్వయకర్త నిరంజన్‌రెడ్డి, అన్ని మండలాల అంగన్‌వాడీ పర్యవేక్షకులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతిగృహ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్



సమావేశానికి హాజరైన అధికారులు

నిర్మల్ అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విద్యాశాఖ అధికారులు, బీసీ సంక్షేమ వసతి గృహ, మహాత్మా జ్యోతి బాపూలే వసతి గృహ ప్రిన్సిపాళ్లు, హెడ్ కుక్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ వసతి గృహాల్లో చదివే ప్రతి విద్యార్థికి మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. మండలాల వారీగా వసతిగృహాల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య, వారికి అందిస్తున్న భోజన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వంటకు నాణ్యమైన కూరగాయలు, సరుకులు మాత్రమే వినియోగించాలన్నారు. కూరగాయల సరఫరాదారులు వసతిగృహాలకు నాణ్యమైన కూరగాయలు, చికెన్, మటన్, కోడిగుడ్లు, అరటిపండ్లు, పాల ఇతర సరుకులను సరఫరా చేయాలన్నారు. సరఫరా దారులు అందించిన వస్తువుల నాణ్యతను ప్రిన్సిపాళ్లు పరిశీలించి, వస్తువుల నాణ్యత సరిగా లేనట్లయితే వాటిని తిరిగి వెనక్కి పంపించాలని తెలిపారు. కుళ్ళి, నిల్వ ఉంచిన కూరగాయలు, చికెన్, మటన్, కోడిగుడ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ వంటకు ఉపయోగించరాదన్నారు. అన్ని సరుకులను పరిశుభ్రంగా ఎప్పటికప్పుడు సరఫరా చేయాలని తెలిపారు. కూరయగాలను నేరుగా నేలమీద ఉంచకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. వంటకు ముందు కూరగాయలను ఉప్పు నీటితో కడగాలని సూచించారు. పుచ్చులు, పురుగులు ఉన్న కూరగాయలను వంటకు ఉపయోగించరాదన్నారు. వంటగది, స్టోర్‌రూమ్, డైనింగ్ హాల్‌ను ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలన్నారు. వంట గదిలో దోమలు, ఈగలు, పురుగులు, బొద్దింకలు, బల్లులు, ఇతర కీటకాలు వ్యాపించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వంట మనుషులు ఎప్పటికప్పుడు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, వంటకు ముందు చేతులు, కాళ్లను పరిశుభ్రంగా కడుక్కోవాలన్నారు. వంట చేసే సమయంలో తప్పనిసరిగా హెడ్ క్యాప్, మాస్క్, ఆప్రాన్ ధరించాలన్నారు. వంట పాత్రలను డిష్ వాషర్లతో ఒకటికి రెండుసార్లు శుభ్రపరచాలన్నారు. వసతి గృహాల్లోని నీటి తొట్టెలను వెంట వెంటనే శుభ్రపరచాలని తెలిపారు. విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీటిని మాత్రమే అందించాలన్నారు. బియ్యం, పప్పు దినుసులను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. వంట సరుకులు వసతి గృహానికి రాగానే వస్తువుల గడువు తేదీ ప్రత్యేక రిజిస్టర్లలో నమోదు చేసి ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకుంటూ ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గడువు తీరిన వస్తువులను వంటకు ఉపయోగించరాదని తెలిపారు. మరుగుదొడ్లను, వసతిగృహ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ అదికారి డి. శ్రీనివాస్, సహాయ బీసీ సంక్షేమ అధికారి సత్యనారాయణ రెడ్డి, ప్రాంతీయ సమన్వయకర్త గోపీచంద్, బీసీ సంక్షేమ గృహ, మహాత్మా జ్యోతి బాపూలే సంక్షేమ వసతి గృహాల ప్రిన్సిపాళ్లు, వంట మనుషులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సింహగర్జన విజయవంతానికి మాలలంతా తరలిరావాలి

● ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ ముథోల్ సెగ్మెంట్ అధ్యక్షులు శంకర్ చంద్రే

భైంసా, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జాతి జనమంతా జాగృతమై వచ్చే నెల 1న హైదరాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే మాలల సింహగర్జన విజయవంతానికి ఉప్పెనలా తరలి రావాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ ముథోల్ సెగ్మెంట్ అధ్యక్షులు శంకర్ చంద్రే వెల్లడించారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన సింహగర్జన సన్నద్ధ సభలలో పాల్గొని మాట్లాడారు. మాలల ఐక్యత, హక్కుల పరిరక్షణ, ఆత్మ గౌరవానికి సంబంధించి నిర్వహించబడే సింహగర్జనకు డివిజన్ పరిధిలోని మాలలంతా అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు. ఎస్సీ వర్గీకరణ ఉపసంహరణయే ధ్యేయంగా సింహగర్జన సభ నుంచి పోరుబాట సమర శంఖారావాన్ని పూరించడం జరుగుతుందన్నారు. జాతి పట్ల జరుగుతున్న వివక్షత, పక్షపాతదోరణి, అణగదొక్కే విధానాలకు చరమగీతం పాడేలా మాల యువత నడుం బిగించాలన్నారు. ఎస్సీ వర్గీకరణ ఉపసంహరణకు గ్రామ స్థాయి నుంచి ప్రణాళికబద్ధమైన ఉద్యమ బాటకు మాలలంతా సంసిద్ధులవ్వాలని పిలుపునిచ్చారు. సింహగర్జన ద్వారా మాలల శక్తి ప్రభుత్వానికి చూపుదామన్నారు.సన్నద్ధ సభ నిర్వహించిన గ్రామాల్లో ఎస్సీ వర్గీకరణ కమిటీ శ్రేణులు సింహగర్జన విజయవంతానికి ర్యాలీలు, ప్రదర్శనలు చేపట్టారు. ఇందులో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ భైంసా డివిజన్ ప్రతినిధులు గిరిధర్ జంగ్మే, దాసరి రాజారామ్, విజయ్‌కుమార్ దగ్డేతో పాటు ఆయా ప్రాంతాలవాసులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ అంతరాయం

నిర్మల్ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అక్కాపూర్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9:30 నుండి 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. కొండాపూర్, భాగ్యనగర్, న్యూ పోచంపాడ్, రత్నాపూర్ కాండ్లీ, తండా వాసులకు సరఫరా నిలిచిపోతుందన్నారు.

ఖానాపూర్ తహసీల్దార్‌కు తృటిలో తప్పిన ప్రమాదం

ఖానాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ తహసీల్దార్ శివరాజ్‌కు తృటిలో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం... శుక్రవారం రాత్రి తహసీల్దార్ శివరాజ్ ఖానాపూర్ నుండి నిర్మల్ వైపు తన కారులో వెళ్తునానడు. కాగా నర్సాపూర్ - కనకాపూర్ గ్రామాల మార్గమధ్యంలో తహసీల్దార్ ప్రయాణిస్తున్న కారు ముందర ఓ హార్వెస్టర్ వాహనం వెళ్తోంది. హార్వెస్టర్ వెనకాల తహసీల్దార్ ప్రయాణిస్తున్న కారు వస్తుండగా ఎదురుగా నిర్మల్ వైపు నుండి ఖానాపూర్ వైపుకు ఒక టాటా ఏసీ వాహనం వెళ్తోంది. హార్వెస్టర్‌కు ఎటువంటి ఇండికేటర్స్ లేకపోవడం ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఇరువురు అంచనా వేయడంలో విఫలం కావడంతో రెండు వాహనాలు ఒకదానినొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తహసీల్దార్ ప్రయాణిస్తున్న కారు పూర్తిగా దెబ్బతినగా కారు నుజ్జు నుజ్జు అయినప్పటికీ తహసీల్దార్ శివరాజ్ సహా ఎదురుగా వస్తున్న వాహనంలోని ప్రయాణికులు సైతం ఎటువంటి ప్రమాదం లేకుండా బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ప్రారంభమైన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

● ఇద్దరు కాపీరాయుళ్ల పట్టివేత

భైంసా, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) కాకతీయ యూనివర్సిటీ పరిధిలో శుక్రవారం డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభయ్యాయి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పరీక్షలు ప్రారంభమైన తొలిరోజే భైంసా పట్టణంలోని గోపాల్‌రావ్ పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలోని పరీక్ష కేంద్రంలో కాపీయింగ్ పాల్పడుతూ ఇద్దరు పట్టుబడ్డారు. కళాశాల ప్రిన్సిపల్ కర్రోల్ల బుచ్చయ్య కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు విద్యార్థులు పట్టుకొని మాల్ ప్రాక్టీస్ కింద బుక్ చేశారు.

వృద్ధులకు బ్లాంకెట్ల అందజేత

నిర్మల్ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణంలోని వృద్ధాశ్రమంలో శుక్రవారం శుభ సంకల్పం సంస్థ వృద్ధులకు బ్లాంకెట్లను అందించారు. చలికాలం దృష్ట్యా వృద్ధులు ఇబ్బందులు పడకూడదని బ్లాంకెట్లను పంపిణీ చేస్తున్నట్లు సభ్యులు తెలిపారు. విశ్రాంత ఎంఆర్‌వో భీమ్‌రావు, గడిచెర్ల అక్షయ్ శర్మ, అభినవ్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

అడెల్లిలో వ్యాపారాలకు ముగిసిన వేలం

సారంగాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అడెల్లి మహాపోచమ్మ దేవాలయం వద్ద వ్యాపారాలకు శుక్రవారం టెంట్‌హౌస్, వంటపాత్రలకు వేలం పాటను నిర్వహించారు. ఈ వేలం పాటలో టెంట్ హౌస్, వంట పాత్రలు అద్దెకు ఇవ్వడానికి రూ. 1 లక్ష 65 వేలు వేలంపాటలో వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ వేలంపాట కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు ఉన్నారు.